క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీపీటీఓకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షల విషయంలో సమన్యాయం పాటిస్తున్న సర్క్యులర్ 1/2019ను కచ్చితంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ డ్యూటీలను రద్దు చేసి, డ్రైవర్ల రిక్రూట్ మెంట్ చేపట్టాలన్నారు. ఈ ఆందోళనలో పూర్వ తూర్పుగోదావరి జిల్లాలోని తొమ్మిది డిపోల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని ఏడు డిపోలలో ఇసుకను నిల్వ చేశామని జిల్లా గనులు, భూగర్భ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ ఏడు ఇసుక నిల్వల స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక లోడింగ్, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనను అతిక్రమించి రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని స్థానిక లారీ యజమానులు, డ్రైవర్లు గమనించాలని కోరారు.

జేవీకే హాస్పిటల్ ప్రారంభం


జేవీకే హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న జోసఫ్ విజయ్ కుమార్ దంపతులు

ప్రకాశం నగర్: క్వారీ మార్కెట్ నుంచి లాలా చెరువు వచ్చే రోడ్డులోని క్రైస్ట్ వర్షిప్ సెంటర్ సమీపంలో జాన్‌వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన జేవీకే హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. జాన్ వెస్లీ తల్లిదండ్రులు జోసఫ్ విజయ్ కుమార్, సత్య విజయ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలతో రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, షెకీనా గ్లోరీ కుటుంబ సభ్యులు, పాల్ ఇమ్మానుయేల్ కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాన్‌వెస్లీ సతీమణీ బ్లెసీవెస్లీ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన డాక్టర్లు, అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వే


సీతానగరంలో సర్వే నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సీతానగరం: మండలంలో గురువారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ జరిగింది. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మండలంలో ఇంటింటికీ పర్యటించి కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి, ఆ ఇంటిలో ప్రతి ఒక్కరిని పరిశీలిస్తారన్నారు. ఎవరికైనా అనుమానాస్పద మచ్చలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇస్తారని తెలిపారు. అనంతరం ఆ మచ్చలు కుష్ఠు వ్యాధికి సంబంధించినవా, కాదా అనే దానిపై పరీక్ష జరుపుతామని, నిర్ధారణ అయితే వారికి ఇంటి వద్దే మందులు ఉచితంగా ఇస్తామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మధురపూడి: కోరుకొండలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిర్మాణానికి రూ.20,118 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ నాయకులకు దాతలు అందజేశారు. స్వామివారి భక్తుడు, క్రాఫ్ట్ టీచర్, దివంగత బడేటి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ నగదు అందించారు.

తల్లిదండ్రుల ద్వారానే సత్ప్రవర్తన

మధురపూడి: తల్లిదండ్రులు, మంచి స్నేహితుల ద్వారానే పిల్లలకు సత్ప్రవర్తన అలవడుతుందని ఎంపీడీఓ హేమ సుందరరావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాలులో గురువారం బేటీ బచావో– బేటీ పడావో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలన్నారు. బాలికలు ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై ఆనంద కుమార్, డీటీ నరేష్, డీసీపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


ముంపు బారిన కంబాల చెరువు రోడ్డు


కోరుకొండ రోడ్డులో నిలిచిన నీరు


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్


కడియంలో ముంపునీరు పోయేందుకు డ్రైనేజీలో చెత్తను తొలగిస్తున్న కార్మికుడు

ఆగని వర్షం .. జల దిగ్బంధం

- కుండపోత వర్షంతో ముంపు బారిన నగరం
- రోడ్లపైకి చేరిన నీరు
- రాకపోకలకు తీవ్ర అవస్థలు

రాజమహేంద్రవరం సిటీ: కుండపోత వర్షానికి చారిత్రక నగరం ముంపు బారిన పడింది. ఏకదాటిగా కురుస్తున్న వానతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. రాజమహేంద్రవరంలో గురువారం తెల్లవారుజాము నుంచి రోజంతా దాదాపు వాన కురుస్తూనే ఉంది. డ్రైనేజీలు ఎక్కడికక్కడ పొంగిపొర్లి నీరంతా రోడ్లపైకి చేరింది. నగరంలో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వీధులన్నీ జలమయం

నగరంలోని కృష్ణనగర్, షాడే బాలికల హైస్కూల్ రోడ్డు, కంబాల చెరువు సమీపంలోని వివేకానంద సెంటర్, ఇన్‌కం టాక్స్ ఆఫీస్, వీరభద్రపురం పేపర్ మిల్ రోడ్డు, హైటెక్ బస్సుషెల్టర్ ప్రాంతం, రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ రోడ్డు, అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, కోరుకొండ రోడ్డులోని మార్కెట్ యార్డ్, ఆర్యాపురం, వీఎల్ పురం, జేఎన్ రోడ్డు, రామచంద్రరావుపేట, ఆదెమ్మదిబ్బ తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షపు నీరు రోడ్లపై చేరింది. దాదాపు మూడు నుంచి నాలుగు అడుగుల మేర నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో మోటారు సైకిళ్లు కొట్టుకునే పోయే పరిస్థితి నెలకొంది.

భారీ వర్షాలతో అప్రమత్తం : ఎంపీ పురందేశ్వరి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. మరో మూడు


జలమయమైన కృష్ణానగర్


ఇన్‌కం ట్యాక్స్ ఆఫీస్ సమీపంలో మునిగిన రోడ్డు

రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసినందున జిల్లా వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్లమెంట్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులు వస్తే వెంటనే మరమత్తులు చేయాలన్నారు. పార్లమెంట్ నియోజక వర్గంలో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు తలెత్తితే 87903 78374, 94923 85664 నబర్లను సంప్రదించాలన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

కుండపోతగా కురుస్తున్న వర్షంతో నగరాన్ని ముంపుబారి నుంచి కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం ప్రారంభం కాగానే అన్ని పంపింగ్ స్టేషన్లను అప్రమత్తం చేసి వర్షపు నీటిని పంపింగ్ చేసే కార్యక్రమం ప్రారంభించామన్నారు. తద్వారా వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తోడివేయడంతో నగరంలో చాలా వరకు ముంపును తగ్గించగలిగామన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న తదితరులు ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలు : ఎమ్మెల్యే శ్రీనివాస్

రాబోయే మూడు రోజులు కూడా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. వర్షాల కారణంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలోని అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించామన్నారు. ప్రమాదకరంగా ఉన్న మేజర్ డ్రైనేజీలపై శ్లాబ్‌లు వేయాలని అధికారులకు సూచించామన్నారు. డయేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

కుండపోత వాన

కడియం: ఎడతెగని వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి ప్రారంభమైన వాన గురువారం కూడా ఆగకుండా కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. పల్లపు ప్రాంతాలన్నీ ముంపుబారిన పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. జనావాసాల నుంచి ముంపునీరు బయటకు పోయేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు. మండలంలోని వేమగిరి తోట, కొత్తపేట, కడియంలోని భాస్కరరామ్ నగర్, దుళ్ల బీసీ కాలనీ, ఎర్రకాలనీ తదిర ప్రాంతాల్లో ముంపునీరు నిలిచిపోయింది.

రైతుల్లో ఆందోళన

ఏకధాటిగా కురుస్తున్న వర్షం రైతుల్లో ఆందోళన పెంచుతోంది. ఊడ్పులు పూర్తయిన చేలల్లో సైతం మూనలు కన్పించకుండా నీరు నిలిచిపోయింది. దీంతో నారు దెబ్బతింటుందేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కురుస్తున్న వర్షం కారణంగా ముంపు నీరు బయటకు పోవడం లేదు. దీంతో వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. రానున్న మూడు రోజులు కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల గ్రామాల పరిధిలోని వరిసాగు చేసే రైతుల్లో ఆందోళన పెరుగుతోంది.

ఆర్యాపురం బ్యాంక్ పరిరక్షణకే పోటీ

- ఉన్నతమైన వ్యక్తులతో నందెపు ప్యానల్
- ఓటమి భయంతోనే రౌతుపై ఆరోపణలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం, చిత్రంలో నందెపు శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను పరిరక్షించాలన్న ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీకి దిగుతున్నామని చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్, ప్యానల్ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక సంహిత ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పలు రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులతో బ్యాంక్ ఎన్నికల్లో మంచి ప్యానల్‌ను ఏర్పాటు చేశామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్, క్రెడాయ్, రోటరీ, ఎస్పీ మార్కెట్, లయన్స్ వంటి వ్యాపార, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన అనుభవంతో నందెపు శ్రీనివాస్ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ప్యానల్ లోని నందం కుమార్ రాజా, లంక సత్యనారాయణ, దూడల త్రినాథ్, పెదిరెడ్ల శ్రీనివాస్, కస్సే రాజేష్, పెంకే సురేష్ వివిధ రంగాల నుంచి రావడమే కాకుండా, బ్యాంక్ డైరెక్టర్లుగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో కూండ్రపు రాంబాబును ప్యానల్‌లో పెట్టామన్నారు. బ్యాంక్‌లో అవతవకలకు పాల్పడి 51 ఎంక్వయిరీ ఎదుర్కొన్న వ్యక్తితోనే ప్యానల్ ఏర్పాటు చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయన్నారు.

చల్లా అసత్య ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంక్ మాజీ చైర్మన్, ప్రస్తుత చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో అసిస్టెంట్ సీఈఓ సుధాకర్, నాటి డైరెక్టర్ రంగబాబుతో ఫిర్యాదులు చేయించి 51 ఎంక్వయిరీ వేయించారన్నారు. చల్లాపై 51 ఎంక్వయిరీ 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని గుర్తు చేశారు. రూ.5.62 కోట్లు బ్యాంక్‌కు చెల్లించాలని బ్యాంక్ చైర్మన్, సీఈఓ, డైరెక్టర్‌లకు పెనాల్టీ విధించారన్నారు. అప్పటి సీఈఓ సుబ్రహ్మణ్యాన్ని బ్యాంక్ నుంచి బయటకు పంపించాలని వేయించిన 51 ఎంక్వయిరీ తిరిగి చల్లా మెడకే చుట్టుకుందన్నారు.

బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకుందాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ చిరు వ్యాపారులు, పేద వర్గాలకు చేయూతను ఇచ్చే సహకార బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల్లో నందెపు శ్రీనివాస్ ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. దేశంలోనే మంచి గుర్తింపు కలిగిన ఆర్యాపురం బ్యాంక్ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయగల సామర్థ్యం నందెపు శ్రీనివాస్ ప్యానల్‌కు ఉందన్నారు. బ్యాంక్ డిపాజిట్‌లు ప్రస్తుతం రూ.680 కోట్లు ఉన్నాయని వాటిని రెట్టింపు చేయడం, ఏపీఏను తగ్గించి సాప్ నుంచి బ్యాంక్‌ను బయటకు తీసుకువచ్చి వాటాదారులకు 15 శాతం డివిడెండ్‌లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డైరెక్టర్ అభ్యర్థులు, విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ పాల్గొన్నారు.

నందెపు బెల్ట్‌ను గెలిపించాలి

ప్రకాశం నగర్: ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధి కోసం నందెపు శ్రీనివాస్ బెల్ట్‌ను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం నగర సమితి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంక్ పాలక మండలి చైర్మన్‌గా చల్లా శంకర్రావు ఉన్నప్పుడు అనేక అవకతవకలు జరిగాయన్నారు. వాటిపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

ఎస్వీ రంగారావు కీర్తి అజరామరం


ఎస్వీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దివంగత సినీనటుడు ఎస్వీ రంగారావు కీర్తి అజరామరమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత కొత్తపేట రాజా ఆధ్వర్యంలో గోదావరి గట్టున ఉన్న ఎస్వీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఆయన వర్ధంతి నిర్వహించారు. ఎస్వీఆర్ విగ్రహానికి జక్కంపూడి గణేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు నందెపు శ్రీనివాస్, కొత్తపేట రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణేష్ మాట్లాడుతూ ఎస్వీఆర్ వంటి నటుడు యుగానికి ఒక్కడు జన్మిస్తాడని కొనియాడారు.


ఎస్వీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ స్థాయి ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న మొట్టమొదటి నటుడిగా ఎస్వీ రంగారావు చరిత్ర సృష్టించారని నటుడు, గాయకుడు జిత్ మోహన్‌మిత్ర కొనియాడారు. ఎస్వీఆర్ 50వ వర్ధంతిని గురువారం రాత్రి జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై నిర్వహించారు. ఎస్వీఆర్ చిత్రపటానికి జిత్‌మోహన్‌మిత్ర, సినీ విశ్లేషకులు అడబాల మరిడయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

రాజమహేంద్రవరం రూరల్: పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం ద్వారా వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చునని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు మూడు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జన్యుపరమైన వైకల్యాలు, నెలలు నిండక ముందే పుట్టే పిల్లలు, మెల్లకన్ను, గ్రహణం మొర్రి, వంకర పాదాలు, కంటి శుక్లాలు, వినికిడి లోపం, గుండె సంబంధిత సమస్యలను గుర్తించి సత్వర చికిత్స అందించాలన్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా చిన్నపిల్లల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకోవడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను గుర్తించి వైకల్యాలు, లోపాలు, బాల్యానికి సంబంధించిన వ్యాధులను అరికట్టడం జరుగుతుందన్నారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద పుట్టిన శిశువుల నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లలకు చికిత్స అందించాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు.

చిన్న పిల్లల వైద్య నిపుణులు ప్రశాంత్ మాట్లాడుతూ పిల్లల్లో పుట్టుకతో వచ్చే జన్యుపరమైన లోపాలు, వాటి చికిత్సా విధానాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- రేపు పోలింగ్, ఆదివారం లెక్కింపు
- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్, ఎన్నికల అధికారి పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని 48, ఇతర ప్రాంతాలలోని 6 పోలింగు కేంద్రాలలో సభ్యులు ఓటు వేసేలా సంబంధిత రిటర్నింగ్ అధికారి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారి ఓటు గుర్తింపు కార్డును పరిశీలించి, లోపలకు అనుమతించాలన్నారు. ఆర్యాపురం బ్యాంక్‌కు దాదాపు పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, ప్రాంగణాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఆర్యాపురం బ్యాంకు ఎన్నికల ఓటింగ్ శనివారం, లెక్కింపు ఆదివారం జరుగుతుందన్నారు.

11 డైరెక్టర్ పోస్టులు

జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ ఆర్యాపురం అర్బన్ బ్యాంకు పరిధిలోని 16 బ్రాంచ్‌లలో 11 డైరెక్టర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 74,585 మంది సభ్యులు ఓటు వేస్తారని వివరించారు. రాజమహేంద్రవరం పరిధిలోని 8 బ్రాంచ్‌లలో 70,519 మంది ఓటర్ల కోసం 48 పోలింగ్ కేంద్రాలను


ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ, ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ రెండు ప్రాంగణాల్లో ఏర్పాటు చేశామన్నారు. దివాన్ చెరువు, భీమవరం, అమలాపురం , విశాఖపట్నం సీతమ్మధార, గుంటూరు బ్రాంచ్‌లలో 4,066 మంది ఓటు వేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బాక్సులను భద్రత మధ్య రాజమహేంద్రవరం తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, ఏఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, బ్యాంకు ఎన్నికల అధికారి /డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్, డీఎస్పీ విజయ పాల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.శరత్ బాబు పాల్గొన్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కొవ్వూరు డివిజన్ కో ఆపరేటివ్ అధికారి, ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల అధికారి కృష్ణకాంత్ తెలిపారు. దానవాయిపేటలోని ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు.

డయేరియాకు కారణమవుతున్న కోళ్ల ఫారాలు


అచ్యుతాపురంలో కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీణాదేవి

రంగంపేట: గ్రామాల్లో డయేరియా ప్రబలడానికి కోళ్ల ఫారాలు కారణమవుతున్నాయని రాజమహేంద్రవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌పీఓ) పి.వీణాదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలోని కోళ్ల ఫారాలను గురువారం ఆమె ఎంపీడీఓ పి.వెంకటరత్నంతో కలసి తనిఖీ చేశారు. కోళ్ల ఫారాల్లో పెంట వల్ల ఈ ప్రదేశంలోను, గ్రామంలోను ఈగలు విపరీతంగా పెరిగిపోవడమే కాక, కోళ్ల ఫారాల్లోని దుర్గంధపు నీరు గ్రామానికి ఆనుకుని ఉన్న డ్రైనేజీలోకి వెళుతుందన్నారు. దీనిపై కోళ్ల ఫారం సిబ్బందిని నిలదీశారు. గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ అక్కడి పరిస్థితులను ఆమెకు తెలియజేశారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

12 గ్యాస్ సిలిండర్ల సీజ్


కిరాణా దుకాణంలో గుర్తించిన గ్యాస్ సిలిండర్లు

రాజానగరం: కొత్త తుంగపాడు గ్రామంలోని ఒక కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 వంట గ్యాస్ సిలిండర్లను గురువారం పట్టుకుని, నిందితులపై 6ఏ కేసు నమోదు చేశామని మండల సివిల్ సప్లయిస్ అధికారి గొలుగూరి బాపిరాజు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు కిరాణా దుకాణంలో తనిఖీ చేసి ఆరు ఫుల్, ఆరు ఖాళీ సిలెండర్లను సీజ్ చేశామన్నారు. వాటిని సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. సిలిండర్లను నిల్వ ఉంచిన దుకాణం యజమాని నాళం చంటిబాబుపై 6 ఏ కేసు నమోదు చేశామన్నారు.

సినిమాలు

శ్యామల	భారతీయుడు-2
సూర్యమినీ	బ్యాడ్‌న్యూస్
సూర్యప్యాలెస్	భారతీయుడు-2
స్వామి	ట్విస్టర్స్
అశోక	కల్కి2898ఏడీ
శివజ్యోతి	పేకమేడలు
అనుశ్రీ	డార్లింగ్
రంభ	క్రైమ్‌రియల్
ఊర్వశి	డిమోంటీకాలనీ
కుమారి	నరబలి
అప్సర	కల్కి2898ఏడీ
నామవరం	
వీఎస్ మహల్	డార్లింగ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కల్కి2898ఏడీ
కడియం	
వెంకటసూర్య	డార్లింగ్